ప్రజాశక్తి
గురువారం 12 సెప్టెంబర్ 2024

జీతాలిచ్చి మా ఆకలిబాధ తీర్చండి

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఆరు నెలలుగా జీతాలు లేక కుటుంబాలు గడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు జీతాలు చెల్లించి ఆదుకోవాలని ఐసిడిఎస్ వాహన డ్రైవర్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని, ఐసిడిఎస్ పీడీని కోరారు. బుధవారం మంత్రికి, పీడీకి వేర్వేరుగా వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ హైర్ వెహికల్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు గదులు సత్యన్నారాయణ మాట్లాడుతూ తమకు ఏప్రిల్ 2024 నుండి నేటి జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే వేతనాలు వచ్చేలా బడ్జెట్ కంటిన్యూషన్ ఆర్డర్ ఇప్పించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో నాయకులు రాంబాబు, గణపతి, అప్పలనాయుడు, రెల్లి.శ్రీనివాసరావు ఉన్నారు

మంత్రి సంధ్యారాణికి వినతినిస్తున్న నాయకులు

మత్స్యకారులకు అందని భృతి

- రీసర్వే పేరిట సర్కారు మీనమేషాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో గంగపుత్రులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సముద్రంలో చేపలవేట నిషేధ సమయానికిగాను మత్స్యకారులకు అందించాల్సిన జీవన భృతి చెల్లింపు విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో, సుమారు 61రోజులపాటు వేటకు దూరమైన మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నాయి. ప్రభుత్వం మాత్రం రీసర్వే పేరిట కాలయాపన చేస్తోంది. మత్స్యసంపద ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇటు పోషక విలువలతో కూడిన మత్స్య సంపద ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. ఇందుకు సముద్ర జలాలే అత్యంత ప్రధానమైన వనరు. వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉంటుంది. ఈనేపథ్యంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను పోత్సహించడం తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం సాధ్యపడుతుంది. ఈనేపథ్యంలో సముద్రంలో యాంత్రిక పడవలు, మెకనైజ్డు మోటారు బోట్లు ద్వారా చేపట్టే అన్ని రకాల చేపల వేటను ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు ప్రభుత్వం ఏటా నిషేధిస్తున్న విషయం తెలిసిందే.

ఇలాంటి సమయంలో అందిస్తే ఉపయోగం

ప్రపంచ మత్స్యకార దినోత్సవం నవంబర్ 21 తరువాత తర్వాత మత్స్యకార భరోసా రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి ఇస్తారని అధికారులు చెప్తున్నారు. వరుస తుపాన్లతో సతమతమవుతున్న ఇలాంటి సమయంలో అందిస్తే ఆర్థికంగా సహాయం చేసిన వారవుతారు. తుపానులో వేటలేక అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అప్పన్న, చింతపల్లి

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం తీరంలో వందలాది కుటుంబాలు సముద్రవేట ఆధారంగా జీవనం సాగిస్తున్నాయి. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా కూడా కొందరు జీవనోపాధి పొందుతున్నారు. వేటకు అనేక సంప్రదాయ, మోటార్ బోట్లు, తెప్పలు మత్స్యకారులు వినియోగిస్తారు. వీటి యజమానులతోపాటు వాటిలో వేటకు బయలుదేరే కుటుంబాలవారు, 2024 మార్చి 31నాటికి 18ఏళ్లపైబడి 60ఏళ్ల లోపు వయసుగలవారికి సుమారు 3789 మందికి ప్రభుత్వం జీవన భృతి చెల్లించాల్సివుంది. ఆదాయపు పన్ను చెల్లించేవారు కూడా అనర్హులు. మత్స్యకార ఫించను, లేదా ఇతర సామాజిక ఫించను పొందినవారు అనర్హులేనని అప్పట్లో చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం పింఛను పొందినవారూ అనర్హులే. లబ్ధిదారు కుటుంబ సంవత్సర ఆదాయం గామీణ ప్రాంతాల్లో అయితే రూ 1,20,000, పట్టణ ప్రాంతాల్లో రూ.1,44,000కు మించి ఉండదని, అందులోనూ పల్లం భూమి 3 ఎకరాలు , మెట్టు భూమి 10 ఎకరాలకు మించి ఉండదని మెలికపెట్టారు. లబ్ధిదారుని పేరు మీద గాని లేదా వారి కుటుంబ సభ్యుల పేరు మీద నాలుగు చక్రాల వాహనం రిజిస్టరై ఉండరాదు. గృహ వసరాలకు వాడుతున్న విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటరాదు. పట్టణ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగులు మించిన ఖాళీ స్థలం ఉండరాదు. లబ్ధిదారుని కుటుంబంలో ఏ ఒక్కరూ ప్రభుత్వ లేక ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగస్థులై ఉండరాదు. ఈ నిబంధనలకు అనుగుణంగా గడిచిన మేనెలలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేచేపట్టారు. 2023 సెప్టెంబర్ 14వ తేదీ నాటికి రిజిస్టర్ అయిన లైసెన్స్ కలిగి యున్న మోటార్ బోటు, మోటారు లేని సాంప్రదాయ తెప్పల యజమానులు, వాటిలో పనిచేసే వారిని గడిచిన మే నెలలో చేసిన సర్వేలో అధికారులు గుర్తించారు. అర్హులందరికీ వేట నిషేధిత 61 రోజులకుగాను రూ.10వేలు చొప్పున లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు జమ చేయాల్సి వుంది. ఇప్పటికీ జమ ేయక పోవడంతో పాటు మరోసారి రీసర్వే చేపట్టాలంటూ స్థానిక మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు రావడం గమనార్హం.

అభివృద్ధి కుంటుపడితే కఠిన చర్యలు

- ఎంపిడిఒలపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- లక్ష్యాలను సాధించని హౌసింగ్ సిబ్బంది జీతాలు నిలిపేయాలి
- వర్షాలవల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలి
- ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలి : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మండలాల్లో అభివృద్ధి కుంటుపడితే, సంబంధిత ఎంపిడిఒపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో వెనుకబడిన ఎంపిడిఒలను, ఇతర అధికారులను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ నెలలో లక్ష్యాలను సాధించని హౌసింగ్ ఎఇలు, ఇంజినీరింగ్ సహాయకులకు జీతాలను నిలిపివేయాలని ఆదేశించారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో బుధవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, లక్ష్యాల సాధనలో వెనుకబడ్డ అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం ప్రదర్శించారు. గ్రామాల్లో పరిస్థితి పూర్తిగా మెరుగుపడే వరకూ సూపర్ శానిటేషన్ పనులను కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు.ఉపాధి పనులకు సంబంధించి ఈనెల 14లోగా అన్ని మండలాల నుంచి తీర్మానాలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ ప్రగతిలో వెనుకబడ్డ హౌసింగ్ ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై కలెక్టర్ మండిపడ్డారు. లక్ష్యాలను ఎందుకు సాధించలేకపోతున్నారని ప్రశ్నించారు. పనితీరులో మార్పు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెలలో లక్ష్యాలను సాధించని ఎఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల జీతాలను నిలిపివేస్తామని ప్రకటించారు. వ్యవసాయం, వర్షాల ప్రభావంపై సమీక్షిస్తూ వర్షాల వల్ల నష్టపోయిన ప్రతీఒక్కరినీ న్యాయం జరిగే విధంగా, సర్వేచేసి నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుమారు 14 ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నట్లు తేలిందని, వాటిని సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. నష్టపోయిన పశు సంపదకు కూడా పరిహారాన్ని మంజూరు చేయాలన్నారు. ఈ-పంట నమోదును కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల తాత్కాలికంగా మరమ్మతు పనులను వెంటనే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలి : జెసి

ఓటర్ల నమోదుకు సంబంధించి ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ఆర్‌ఒలను, ఎఇఆర్‌ఒలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 88 శాతం సర్వే పూర్తి అయ్యిందని, మిగిలినదానిని మూడు నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు.కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, అదనపు పీడీ అరుణశ్రీ, హౌసింగ్ పీడీ శీనివాసరావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం కార్యాలయం ఆదేశాలు ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూలు పది, ఇంటర్ కోర్సులు చదివేందుకు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 16 నుంచి 25 వరకు గడువు ఉందని తెలిపారు. www.apopenschool.ap.gov.in website చేసుకొని మీకు దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటరు కు వెళ్ళి ఒరిజినల్ సర్టిఫికేట్ లు సమర్పించి తరువాత ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని తెలిపారు. ఆపాస్ ద్వారా పదో తరగతి ప్రవేశాలకు 31.8.2024 నాటికి 14ఏళ్లు వయసు కలిగి ఉండాలని తెలిపారు. టెన్త్ అడ్మిషన్‌కు రికార్డుషీట్ లేదా టిసితోపాటు ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కులధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలని డిఇఒ తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకున్నా జనన ధ్రువీకరణపత్రంతో పాటు స్వీయ ధ్రువీకరణతో నేరుగా పదోతరగతిలో అడ్మిషన్ పొందవచ్చునని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు పై తెలిపిన సర్టిఫికెట్లు అన్నీ ఉండాలని తెలిపారు.

అద్దె చెల్లించని 42 షాపులు మూత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ అధీనంలో ఉన్న దుకాణాల అద్దె బకాయిలను తక్షణం చెల్లించాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్య అన్నారు. దీర్ఘకాలంగా అద్దె బకాయిలున్న దుకాణాలను తక్షణమే సీజ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో బుధవారం సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది, సంబంధిత సచివాలయ కార్యదర్శులతో దుకాణాల వద్దకు వెళ్లి పలు షాపులను సీజ్ చేశారు. మొత్తం 42 షాపులను మూసి వేయించారు. దీంతో హుటాహుటిన పలువురు దుకాణదారులు అద్దెలను చెల్లించారు. అద్దెలు చెల్లించిన దుకాణాలను నగరపాలక సంస్థ సిబ్బంది వెంటనే తెరిపించి దుకాణ దారులకు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన కార్మికులను ఇళ్లకు రప్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, సహాయ చర్యల కోసం విజయనగరం కార్పొరేషన్ నుంచి 120 మంది కార్మికులు పాల్గొని సేవలందించడం అభినందనీయమని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) విజయనగరం కార్పొరేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.భాస్కరరావు అన్నారు. కరోనా సమయంలోనూ ప్రాణాలు తెగించి సేవలందించారని, కానీ వారి సేవలను ప్రభుత్వాలు గుర్తించడం లేదని అన్నారు. విజయవాడలో ఉన్న కార్మికులను తిరిగి రప్పించాలని కోరుతూ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావుకు బుధవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు అక్కడ ఎలాంటి రక్షణ పరికరాలూ ఇవ్వలేదని, అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. భోజన , వసతి సౌకర్యాలు కూడా సరిగ్గా లేవని, దాతలు ఇచ్చిన బిర్యాని, పులిహోర పొట్లాలతో గడపాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని, సహాయక చర్యలో పాల్గొన్న ప్రతి కార్మికునికి ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో రామచంద్రరావు, రమణ ఉన్నారు.

గంజాయి రవాణ నియంత్రణకు నిరంతర తనిఖీలు

- బొడ్డవర పోలీసు చెక్ పోస్టు బలోపేతం
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు
- ఎస్‌పి వకుల్ జిందాల్

జామి పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-శృంగవరపుకోట/జామి

గంజాయి రవాణా నియంత్రణకు నిరంతర తనిఖీలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి ఎస్‌పి వకుల్‌జిందాల్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం ఎస్.కోట, జామి పోలీసు స్టేషన్లను ఎస్‌పి సందర్శించారు. స్టేషను ప్రాంగణాలను, పోలీసు బిల్డింగ్ లోని గదులను, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించారు. స్టేషనులోని వివిధ రికార్డులు, సిడి ఫైల్స్‌ను ఎస్‌పి తనిఖీ చేశారు. అనంతరం ఎస్‌పి ఎస్.కోటలో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి బొడ్డవర మీదుగా ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణ జరుగుతున్నందున, అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా బొడ్డవర చెక్ పోస్టును బలోపేతం చేశామని, నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులపై హిస్టరీ షీట్లు తెరవాలని, వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులను సమీక్షించి, పరారీలో ఉన్న ప్రధాన నిందితులను అరెస్టు చేయాలని, సంబంధిత కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు ఆకస్మికంగా వేరు వేరు ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం, స్టేషనులో క్రైమ్ చార్ట్ పరిశీలించి, పోలీసు స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగు తున్నది, బ్లాక్ స్పాట్స్ ఎక్కడ ఉన్నది సిఐని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు తరుచూ జరుగుటకు గల కారణాలను గుర్తించి, స్పీడు బ్రేకర్లు, స్టాపర్లును ఏర్పాటు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ప్రజలకు రహదారి భద్రత, మహిళల భద్రత పట్ల, కొత్త చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. సైబరు మోసాలపై నమోదైన కేసుల్లో నిందితుల బ్యాంకు అకౌంట్స్ లో ఫ్రీజ్ అయిన నగదును తిరిగి బాధితులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఆదేశించారు. జామి పోలీసు స్టేషన్ తనిఖీ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలకు రహదారి భద్రత, మహిళల భద్రత పట్ల, కొత్త చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, స్పెషల్ బ్రాంచి సిఐ కెకెవి విజయనాథ్, ఎస్.కోట సిఐ కె.రవికుమార్, ఎస్.కోట ఎస్ఐ గంగరాజు, జామి ఎస్ఐ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదలపై రాజకీయాలు తగవు : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రకృతి సహజ వనరులని దోచేసి, వైపరీత్యాలకు కారకులైన వారు, విజయవాడలో వరదల సందర్భంగా ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లిశ్రీనివాస్ పేర్కొన్నారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం పట్ల మంత్రి స్పందించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ వైపరీత్యం వచ్చినా గత ప్రభుత్వం స్పందించిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. ప్రజలమన్ననలు పొందుతున్న ప్రభుత్వాన్ని విమర్శించడం, ప్రజల పట్ల బాధ్యత లేనితనాన్ని గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. విజయవాడ పరిసరాల్లో బుడమేరు కాలువ గట్ల వద్ద మట్టిని వైసిపి నాయకులు దోచుకోవడం వల్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురించి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ప్రజలను ఆదుకోకుండా అవగాహన లేకుండా విమర్శలు చేయటం అప్పల నరసయ్య అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

విద్యార్థులు ప్రాంతీయ భాషనూ నేర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు ఇతర భాషలతో పాటు ప్రాంతీయ భాష కూడా నేర్చుకోవాలని సిటియు విసి టివి కట్టమని తెలిపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బుధవారం 'సులభంగా తెలుగు నేర్చుకోవటం' అనే అంశంపై తెలుగు మాతృభాష కాని విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తెలుగు భాష నేర్చుకోవటం చాలా సులభమని, తెలుగు భాష పదజాలం సరళంగా, మధురంగా ఉంటుదని, తెలుగు మాట్లాడటంలోకనీస మెళకువలు విద్యార్థులు నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం విశాఖపట్నానికి చెందిన ప్రముఖ బహుభాషా శిక్షకురాలు డాక్టర్ దీపా గుప్తా విద్యార్థులతో సులభంగా తెలుగు నేర్చుకోవడం, మాట్లాడడం, తమ నిత్య జీవన శైలిలో ఒక భాగంగా చేసుకోవడం ఎలా అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, డీన్లు ప్రొఫెసర్ సారత్ చంద్ర బాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుప్రియ దాస్, ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ కుసుమ్, ఎఒ డాక్టర్ ఎన్.వి.ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు గోతులు పడిన మయూరి జంక్షన్ వద్ద రహదారి

రోడ్ల నాణ్యతలో డొల్లతనం

వర్షాలతో గోతుల మయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రెండు రోజులు పాటు కురిసిన వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఇటీవల వేసిన రోడ్లు సైతం గోతులు పడడడంతో నాణ్యతలో డొల్లతనం బయటపడింది. ప్రధానంగా మయూరి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా సిఎంఆర్ వరకు వేసిన రోడ్లు, మయూరి జంక్షన్ రోడ్డు, రింగ్ రోడ్డులో భాష్యం స్కూల్ ఎదురుగా, గంతస్తంబం వద్ద, గూడ్స్ షెడ్ వద్ద రోడ్డు గోతులు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. కోట్ల రూపాయిలు ఖర్చు చేసి వేసిన రైల్వే స్టేషన్ రోడ్డు అంతా ప్యాచ్ వర్క్‌తో నిండి ఉంది. రోడ్డు వేసిన నెల రోజులు లోనే రాళ్లు తేలి గోతులు పడిపోవడంతో ప్యాచ్ వర్క్ చేశారు. తాజాగా కురిసిన వర్షానికి రోడ్డు మధ్యలో చాలా చోట్ల గోతులు పడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గూడ్స్‌షెడ్ వద్ద రోడ్డుదీ ఇదే పరిస్థితి. నగర పాలకులు, అధికారులు నిత్యం తిరిగే గంట స్తంభం రోడ్డు కూడా గోతులు పడి రాళ్లు తేలాయి. వెంటనే మరమ్మత్తు చేయకుంటే గోతులు పెద్దవిగా మరి మరింత ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

నాసిరకంగా డివైడర్ పనులు

మయూరి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే రోడ్డు మధ్యలో వేసిన డివైడర్ పనులు నాసిరకంగా ఉన్నాయి. ఇటీవల నిర్మించిన ఈ డివైడర్ ఏడాది కాకముందే పగిలిపోవడంతో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మయూరి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ కి వెళ్లే గణేష్ స్వీట్ షాప్ ఎదురుగా డివైడర్ గోడలకు అంటించిన మార్బుల్స్ ఊడిపోతున్నాయి. కేవలం ఒక్క రోజు కురిసిన వర్షానికే ఇలా ఉంటే ఇంకా భారీ వర్షాలు కురిస్తే నగరంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాల్సింది.

సైబర్ నేరాల నియంత్రణపై జెఎన్‌టియులో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైబర్ నేరాల నియంత్రణపై స్థానిక జెఎన్‌టియులో మూడు రోజులు పాటు జరగనున్న జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభమైంది. సెమినార్ కు జైపూర్ నుంచి వచ్చిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పి.అరుణకుమార్ సైబర్ నేరాల నియంత్రణ కు టెక్నాలిజి పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సైబర్ నేరాలకు ఆచారణలో ఎలా నియంత్రించాలో ఆచరనాత్మక పద్ధతిలో వివరించారు. సెమినార్‌లో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

13న జిల్లా, సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14 నుండి 16 వరకు పలాసలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ఈనెల 13న రాజీవ్ స్టేడియంలో జరుగుతుందని జిల్లా టెన్నీ కాయిట్ సంఘం కార్యదర్శి ఎం.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 1-4-2010 తరువాత పుట్టిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ పట్టుకొని ఉదయం 9 గంటలకు రావాలని తెలిపారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకుయ నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని విద్యుత్తుశాఖ ఇఇ పి.హరి తెలిపారు. మహారాజా హాస్పిటల్ ఫీడర్, బొగ్గులదిబ్బ ఫీడర్, సాయిబాబా టెంపుల్ ఫీడర్, మహాలక్ష్మి నగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించాల్సి ఉన్నందున విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ఉడా కాలనీ ఫేజ్1,2,3,4, జిల్లా కేంద్రాస్పత్రి ఏరియా, పోలయ్యపేట, ఎల్ బి. కాలనీ, మారుతీ నగర్, బొగ్గులదిబ్బ, కంటోన్మెంట్ ఏరియా బొబ్బాదిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాలు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 13న నిర్వహించతలపెట్టిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వాయిదావేసినట్లు సెట్విజ్ సిఇఒ బి. రామగోపాల్ తెలిపారు. తుపాను ప్రభావం వల్ల యువజనోత్సవాలను వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో తెలియజేస్తామనిపేర్కొన్నారు. ఇతర వివరాలకు 8247554334 నంబరులో సంప్రదించాలని తెలిపారు.



వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ అంబేద్కర్‌కు చెక్కులు అందజేస్తున్న డాక్టర్లు చిట్టి రమణారావు, శేషగిరిరావు, మంచుకుమారస్వామి

వైద్యుల ఉదారత

వరద బాధితులకు విరాళాల వెల్లువ
కలెక్టర్‌కు చెక్కులు, డిడిలు అందజేత

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకొనేందుకు వివిధ సంఘాలు, సంస్థలతోపాటు, వ్యక్తిగతంగా కూడా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద్ద మొత్తంలో విరాళాలను అందజేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని పలు ప్రయివేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నుంచి పలువురు డాక్టర్లు విరాళాలకు సంబంధించిన చెక్కులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు బుధవారం కలెక్టరేట్‌లో అందజేశారు. సామాజిక బాధ్యతతో పెద్ద మొత్తంలో విరాళాలను అందించిన వైద్యులను కలెక్టర్ అంబేద్కర్ అభినందించారు. విరాళాలు అందించిన వారిలో కాష్వీ ఆస్పత్రి రూ.50వేలు, శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రూ.50వేలు, ఆంధ్రా చిల్డ్రన్ ఆస్పత్రి, వెంకట రామా ఆస్పత్రి , గాయత్రి ఆస్పత్రి, స్వామి కంటి ఆస్పత్రి, మారుతి ఆస్పత్రి రూ.25వేలు చొప్పున, సాయి పివిఆర్, ఎస్.కోట అభినవ్ ఆస్పత్రి, కోలపర్తి ఆస్పత్రి, సాయికృష్ణా ఆస్పత్రి రూ.15వేలు చొప్పున అందజేశారు.

విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు విశ్రాంత ఎల్‌డిఎం ఎ.శ్రీనివాసరావు తనవంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుమీద రూ.10,116 డిడిని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు అందజేశారు. అలాగే వేమిరెడ్డి లక్ష్మనాయుడు, రెడ్డి సత్యంనాయుడు, చుక్క సన్యాసిరావులు సంయుక్తంగా రూ.11,000 డిడిని కలెక్టర్‌కు అందజేశారు. పెద్ద మనసుతో ముందుకు వచ్చిన దాతలను కలెక్టర్ అభినందించారు.

సత్య కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సత్య డిగ్రీ-పీజీ కళాశాలలో గత నెల 5నుంచి ఈనెల 10వరకు నెల రోజులుపాటు సాఫ్ట్‌స్కిల్స్‌పై వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ, ఉన్నతి ఫౌండేషన్ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ట్రైనర్స్‌గా శాంతి లత, ప్రత్యూష కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్, టైం మేనేజ్మెంట్, లీడర్‌షిప్ , టీం మేనేజ్ మెంట్ తదితర స్కిల్స్‌పై క్లాసులు బోధించారు. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ గోవింద రావు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని, ఈ శిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాల లో సమర్ధతను పెంచుకోవడానికి ఉపయోపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఖచ్చితంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, నైపుణ్యాల అభివద్ధి సంస్థ కో ఆర్డినేటర్ తరుణ్ పట్నాయక్, అనిల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరకట్టలు నిర్మించేదెప్పుడు?

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని తునివాడ నుంచి సంకిలి శివాలయం వరకు కరకట్టలు లేక నాగావళి నది వరదలకు గండి కొట్టే ప్రమాదం ఉన్నందున తక్షణమే కరకట్టలు నిర్మించాలని రేగిడి, సంతకవిటి మండలాల ఆయకట్టు రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 140 ఏళ్లనాటి బ్రిటీష్ కరకట్టలు వర్షాలకు, వరదలకు శిథిలమై వరద గట్టు అల్పంగా తయారయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వరద గట్టు నిర్మించకుంటే భవిష్యత్తులో రెండు మండలాల గ్రామాల ప్రజలకు ముప్పుతో పాటు 11,600ఎకరాల సాగు భూములకు పెను ముప్పు తప్పదని రైతులు చెబుతున్నారు. నాగావళి నదికి అనుబంధ సాయన్న ఛానల్, పిట్టగెడ్డ ఛానల్, పెద్ద కాలువలు, పిల్ల కాలువలు, గోపాలరావు కాలువ, ఇతరత్ర కాలువలు పూర్తిగా దెబ్బతిని మేటలు వేసే ప్రమాదం ఉందని అంటున్నారు.

1990 మార్చి 12న వచ్చిన వరదలకు గట్టులకు గండి పడి సంకిలి, దేవుదల, కొమెర, వెంకటాపురం, ఖండ్యాంతో పాటు సంతకవిటి మండలంలోని కొన్ని గ్రామాల సాగు భూముల్లో మేటలు వేశాయి. రైతులు అప్రమత్తం కావడంతో పెను ముప్పు తప్పింది. సాయన్న ఛానల్ అనుబంధ కాలువలు మేటలు వేసినప్పటికీ పాలకులు, అధికారులు ఆధునీకరణ పనులకు పట్టించుకోలేదు. బ్రిటీష్ కాలం నాటి నాగావళి వరద గట్టుల వద్ద కొత్త గట్టులు నిర్మించాలని, కాకుంటే భవిష్యత్తులో పెను ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బొడ్డవలస గ్రామం వద్ద పూర్తిగా నాగావళి వరద గట్టు నిర్మించకపోవటంతో వరదలకు ఆ గ్రామం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కరకట్టలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కరకట్ట నిర్మించాల్సిన ప్రాంతం ఇదే..

కరకట్టలు నిర్మించుకుంటే భవిష్యత్తులో పెనుముప్పు

సంకిలి పంచాయితీ నాగావళి నది శివాలయం నుంచి తునివాడ వరకు 3కిలోమీటర్ల మేర వరద గట్టులు నిర్మించకుంటే భవిష్యత్తులో పెనుముప్పు తప్పదు. బ్రిటిష్ కాలం నాటి వరద గట్టు ఆల్పంగా ఉంది. ఇప్పటికే వరదలకు గట్టు పైనుంచి వరద నీరు వస్తుంది. ఇక్కడ గండి కొడితే ముప్పు తప్పదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ప్రజలు ఉన్నారు. అధికారులు స్పందించి కరకట్టలు నిర్మించాలి.

టిడిపి నాయకులు నారు జనార్ధనరావు, సంకిలి

ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు

నాగావళి నది శివాలయం పైభాగం నుంచి తునివాడ వరకు, బొడ్డవలస గ్రామం వద్ద కరకట్టలు నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోలేదు. 140ఏళ్ల నాటి వరద గట్టులు స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ఇంత వరకు మంజూరుకు చర్యలు తీసుకోలేదు. ఇక్కడ గండి కొడితే పెను ప్రమాదం తప్పదు.

పాలవలస రామినాయుడు, పుర్లి గ్రామం

ఉన్నతాధికారులకు నివేదిస్తా..

కరకట్టలు నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిస్తా, బ్రిటిష్ కాలం నాటి కరకట్టలు అల్పంగా ఉండడం వాస్తవం. గండి కొడితే భూములు, సాయన్న ఛానల్, వాటి పిల్ల కాలువలు రూపురేఖలు మారడం తప్పదు. సంబంధిత అధికారులతో మాట్లాడి కరకట్టలు మంజూరుకు కృషి చేస్తా.

ఎల్లారావు, తహశీల్దార్, రేగిడి

ట్రస్టు సేవలు వెలకట్టలేనివి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - కొత్తవలస

శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 2.14లక్షల మంది వికలాంగులకు, పేదలకు అందించిన సేవలు వెలకట్టలేనివని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. మంగళపాలెం వద్ద గురుదేవ్ ట్రస్ట్, డాక్టర్ విజయశ్రీ మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రిని ఆయన బుధవారం పరిశీలించారు. ఆసుపత్రిలో ఎటువంటి సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వికలాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాలు తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి లక్షలాది మంది వికలాంగులకు ఉచితంగా సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని, ఎవరు చేయనటువంటి సహాయాన్ని అందిస్తున్నారని జగదీష్ బాబుని అభినందించారు. అనంతరం 50 మంది వికలాంగులకు ఎస్‌పి కృత్రిమ అవయవాలను అందించారు. మరో 50 మందికి పైగా అంధులకు పెన్షన్ అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రావు జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణీంద్ర, డాక్టర్ రాఘవేంద్ర, బి.ఎన్.రావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై కర్రల లారీ బోల్తా

బొబ్బిలి: బొబ్బిలి-తెర్లాం రోడ్డు మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో దిగి బుధవారం కర్రల లారీ బోల్తాపడింది. రోడ్డుపై బోల్తా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో డ్రైవర్లు, క్లీనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వంటలు చేసుకుని అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోల్తా పడిన లారీను క్రెయిన్ సహాయంతో తీసి పక్కకు నెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు బాగు చేయాలని, పాడైన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సాయం

బొబ్బిలి: మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన పి.నారాయణ అనారోగ్యంతో బాధపడడంతో వైద్యానికి ఎమ్మెల్యే బేబినాయన రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. నారాయణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడడంతో వైద్యానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని బేబినాయనకు టిడిపి నాయకులు చెప్పడంతో ఆర్థిక సహాయం చేశారు. చెక్కును నారాయణకు టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, కె.భాస్కరరావు, ఎంపిటిసి రౌతు తిరుపతిరావు బుధవారం అందజేశారు.

28 నుంచి భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్

బొబ్బిలి : మత్తు పదార్థాల నివారణకు విజయనగరం గురజాడ కళాక్షేత్రంలో ఈ నెల 28,29,30న జరగనున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్ కోరారు. భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ గోడపత్రికలను బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు విద్యార్థులు, యువతను మంచి మార్గంలో నడిపించేందుకు ఎస్ఎఫ్ఐ పని చేయడం ఆనందమని డిఎస్‌పి అన్నారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. నేటి యువత భవిష్యత్తుపై డ్రగ్స్ ఎటువంటి ప్రభావం చూపుతుందో అవగాహన కల్పించేందుకు ఫెస్ట్ ఏర్పాటు చేశామని, జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు నాగరాజు,తేజ, గజేంద్ర మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బొండపల్లి : మండలంలోని అంబటివలస గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 69-2, 69-3, 69-4లలో 5.48 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాదీనం చేస్తునట్లు తహశీల్దార్ డి.రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆక్రమణ దారులకు నోటీసులిచ్చి స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఆర్.ఐ సతీష్, విఆర్వో కే.రమేష్ బాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

చీపురుపల్లి: మండలంలోని అలజంగి పంచాయతీ మధుర గ్రామమైన విశ్వనాధపురంలో పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కాంట్రాక్టర్‌ను కోరారు. పాఠశాల భవన నిర్మాణం జరగకపోవడంతో ఆ గ్రామానికి చెందిన కొంతమంది యువకులు, గ్రామస్తులు శ్రీనివాసనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం ఆయన విశ్వనాధపురం వెళ్లి నిర్మాణం జరగకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల స్థానంలో నూతన భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షల నిధులను జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా ద్వారా తీసుకు వచ్చామని నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. 4 నెలల్లో బిల్డింగ్ పనులు పూర్తి చేసి అప్పచెప్పాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు రేవళ్ల సత్తబాబు, చందక సత్యనారాయణ, ప్రభాత్ కుమార్, తిరుపతి, రేవల్ల సత్యం, వెంకీ పాల్గొన్నారు.

ఘనంగా దిగ్విజయ దివాస్

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిగ్విజయ దివాస్‌ని ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న అమెరికా చికాగోలో ప్రపంచ మతాల సమావేశంలో భారతదేశం తరపున పాల్గొని మన హైందవ మత ఘనతను, భారతీయ మత సహనాన్ని ప్రపంచానికి చాటాడని గుర్తు చేశారు. అందుకు గుర్తుగా సెప్టెంబర్ 11ను దిగ్విజయ దివాస్‌గా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు డాక్టర్ వి సుధీర్, స్వామి నాయుడు, షేక్ వలీఖాన్, డాక్టర్ రేచర్ల శ్రీలక్ష్మి, డాక్టర్ ఈరన్న, పి. భాస్కర్, శ్రీనివాస రావు, రామకృష్ణ, లక్ష్మణ్ రావు, విద్యార్థులను పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

వేపాడ: రైతు సాధికార సంస్థ సిబ్బంది, సబల్ సంస్థ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమ సుందర్ తెలిపారు. మండలంలోని సోంపురం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ఆయన సిబ్బందితో మాట్లాడారు. వేపాడను ప్రకృతి వ్యవసాయంలో మోడల్ మండల్‌గా ముందుకు తీసుకెళ్లాలంటే అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనికి కావాల్సిన సహాయ సహకారాలు జిల్లా స్థాయి అధికారులు అందిస్తారని ఆయన తెలిపారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం పైన పూర్తిస్థాయి నమ్మకం కలిగించాలని, రైతు నమ్మినప్పుడే ప్రకృతి వ్యవసాయం బాగా ప్రాచుర్యం పొంది ప్రజల్లోకి చేరుతుందని చెప్పారు. సభల్ ప్రాజెక్టు ద్వారా రైతులకు వివిధ రకాలు సేవలు అందిస్తామన్నారు. అనంతరం అరిగిపాలెం గ్రామంలో సామూహికంగా 500 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారు చేశారు. సోంపురం గ్రామంలో రైతులకు దశపర్ణి కషాయం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌టిఎల్ వసంత, సబల్ పిసి శ్రావణి, సిఎస్ఎ వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

వంగర: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన 2024లో భాగంగా పంట కోత ప్రయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తహశీల్దార్ డి ధర్మరాజు బుధవారం తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు హాజరైన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటికల్ అధికారి, మండల వ్యవసాయ అధికారి పాల్గొని అవగాహన కల్పించారు.

కోలుకుంటున్న చిన్నారి

భోగాపురం: డెంగీ జ్వరంతో బాధపడుతున్న ముక్కాం గ్రామానికి చెందిన చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఎంఇఒ తిరుపతి స్వామి నాయుడు తెలిపారు. ప్లేట్లెట్స్ హెచ్చు తగ్గులు అవుతుండడంతో విజయనగరం గోషాసుపత్రిలో అబ్జర్వేషన్‌లో ఉంచామన్నారు. మరో పక్క ఎంపిడిఒ అప్పలనాయుడు, ఈఒపి ఆర్‌డి సురేష్ ముక్కాం గ్రామంలో పర్యటించారు. ఇంకా ఎటువంటి కేసులు లేవని నిర్ధారించుకున్నారు. పారిశుధ్య పనులతో పాటు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి : సిఐ

రేగిడి: గణేశుని మండపాల నుంచి నిమజ్జనాలపై పెద్దలు, కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని రాజాం రూరల్ సిఐ ఉపేంద్ర రావు సూచించారు. పనసలవలస గ్రామంలో బుధవారం గణేష్ నిమజ్జనాలపై యువత, గ్రామ పెద్దలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనాలలో డీజేలను నిషేధించామన్నారు. వీధుల్లో ఊరేగింపుగా వెళ్లేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. డిజేల్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, వాగులు, నదులలో ఎక్కువ నీరు ఉన్నందున లోతుకు వెళ్ళరాదని సూచించారు. బాణాసంచి కాల్చారాదని సూచించారు.

కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన వైసిపి మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు బావ జి.ఈశ్వరరావు గుండెపోటుతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

బొద్దూరు దళితుల పై వివక్షత

ప్రజాశక్తి- సంతకవిటి

తరాలు మారినా తలరాతలు మారినా దళితులపై వివక్షత మాత్రం మారలేదు. మండలంలోని బొద్దూరు గ్రామంలో ఇటీవల దళితుడు యాగాటి దుర్గాప్రసాద్ (30) అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబానికి అండగా ఉండాల్సిన వ్యక్తి దూరమయ్యారన్న పుట్టెడు దుఃఖంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు. అదే సమయంలో కుంభవృష్టిగా వర్షాలు కురవడంతో ఆ గ్రామ పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దళితులకు కేటాయించిన శ్మశనవాటిక కూడా నీటితో నిండిపోయింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఆ గ్రామ ఎంపిటిసి దళితులంతా కలిశారు. తమ శ్మశాన వాటిక పూర్తిగా నీట మునిగిపోయిందని, బిసిలకు చెందిన శ్మశనవాటికలో మృతదేహానికి దహన సంస్కరణలు చేస్తామని చెప్పారు. దానికి ససేమేరా అంటునే తనకు సంబంధం లేదని సర్పంచ్‌ని కలవాలని ఎంపిటిసి దళితులను పంపించేశారు. దళితులంతా ఆ గ్రామ సర్పంచ్‌ని కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. అగ్ర కులాలకు సంబంధించిన శ్మశాన వాటికలో దళితులు అంతిమ సంస్కరణలకు ఒప్పుకునేది లేదని తొలుత సర్పంచ్ కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. ఏం చేయాలో పాలుపోనీ సదరు దళితులు సర్పంచ్ కాళ్లావేళ్ల పడి ఒప్పించారు. అయితే సదరు సర్పంచ్ తమ శ్మశాన వాటికలో ఏదో ఒక మూలన దహన సంస్కరణ చేసుకోమని వారిని చీదరించుకున్నారు. దీంతో వారంతా శ్మశానానికి చేరుకుని ఒక మూల దహన సంస్కరణలు చేసి వెనుదిరిగారు. తమ జాతినేత అంబేద్కర్ విగ్రహాన్ని ఆకాశమంత ఎత్తులో కట్టారని సంబరపడ్డామే తప్ప, నాటి తరాలు అనుభవించిన పరిస్థితులు నేటికీ ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన చెందారు. అంబేద్కర్ వాది ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ నియోజకవర్గంలోనే ఇటువంటి సంఘటనలు జరగడం పట్ల దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ స్పందించి శ్మశాన వాటికకు తగిన నిధులు కేటాయించాలని దళితులు కోరుతున్నారు.

ఒక మూలన దహన సంస్కారం చేస్తున్న దళితులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

అభివృద్ధికి అందరూ సహకరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన ఎంపిడిఒ వై. పద్మజ బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అకాల వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కూడా తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు. నియోజకవర్గంలో రైతులకు ఎటువంటి సమస్య ఏర్పడినా తక్షణం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీలాక్దర్ బి. నీలకంఠారావ్, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, చింతలపాలెం సర్పంచ్ మాకేన నవీన్ పాత్రుడు, ఇతర సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాల ఉత్పత్తులకు పెద్ద పీట

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్

ప్రజాశక్తి - భోగాపురం

నాణ్యమైన పాల ఉత్పత్తులు, పాలు వినియోగదారులకు అందించడానికి విశాఖ డెయిరీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద కుమార్ అన్నారు. మండలంలో ఎ.రావివలస పంచాయతీ నారుపేట గ్రామం వద్ద విశాఖ డైరీ మిల్క్‌బల్క్ కూలింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పది వేల లీటర్ల పాలు సేకరణ ఉన్న చోట పాలలో నాణ్యత పోకుండా ఉండేందుకు మిల్క్‌బల్క్ కూలింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విజయనగరం జిల్లాలో రెండు, శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం వద్ద ఈ నెలలో కొత్త సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మిగతా డెయిరీల కన్నా అత్యధికంగా పాల ధర అందిస్తున్నామన్నారు. రైతులకు ఉచితంగా వెటర్నరీ సేవలు, పశుదాణా సబ్సిడీ మీద ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ సంవత్సరం పాల బట్వాడా ఆధారంగా బోనస్‌లు కూడా రైతులకు ఇస్తున్నామన్నారు. పాడి పశువులకు, రైతులకు డెయిరీ ద్వారా బీమా కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కాటమయ్య జి.ఎం.కుమార్, డి.జి.ఎం పాండ్యరాజన్ విజయనగరం మేనేజర్ వేణు, భోగాపురం సూపర్ వైజర్ వాసుబాబు, పాల సంఘాల ప్రెసిడెంట్లు, పాల సేకరణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ ఆనందకుమార్

నరకంగా రైలు ప్రయాణం

ప్రజాశక్తి- బొబ్బిలి

పార్వతీపురం, బొబ్బిలి నుంచి విజయనగరం, విశాఖపట్నంకు రైల్వే ప్రయాణం నరకంగా ఉంటుందని సిపిఎం పార్టీ బొబ్బిలి పట్టణ కార్యదర్శి పి. శంకరరావు అన్నారు. బుధవారం ఆయన రైలు ప్రయాణం తరువాత మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగస్తులు, వైద్యం నిమిత్తం రోజూ వేలమంది ఈ ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తున్నారని ఉదయం దుర్గ్, భవానిపట్నం రెండు ట్రైన్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని సాయంత్రం కూడా ఈ రెండు రైల్లే ఉంటున్నాయని మిగతా సమయంలో ఈ ప్రాంతాలకు ఒక ట్రైను కూడా లేదని గుర్తు చేశారు. ఉదయం వెళ్లేటప్పుడు కిక్కిరిసి వేలాడుతూ వెళ్లి, సాయంత్రం కిక్కిరిసి వేలాతూ రావాల్సిందేనని ఇది చాలా ప్రమాదకర ప్రయాణమని చెప్పారు. పాలకుల నిర్లక్ష్యం రైల్వే డిపార్ట్మెంట్ చిన్నచూపు వల్లే మన ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. విశాఖపట్నం నుంచి పార్వతిపురానికి ఒక సెటిల్ సర్వీస్ కానీ మెమో లాంటి ట్రైన్ ట్రిప్పులు తిరిగేటట్లు తక్షణమే వేయాలని రైల్వే డిపార్ట్మెంట్‌కు కేంద్రానికి మద్దతు ఇస్తున్న టిడిపి కూటమి ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వెంటనే స్పందించకపోతే విద్యార్థుల్ని ప్రజల్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సిఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. వరద బాధితులకు సహాయం చేయాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో విరాళాలు ఇచ్చేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. జె.రంగరాయపురం సర్పంచ్ కునుకు రాధ, రమణ రూ.20వేలు ఎం.బూర్జవలస ఎంపిటిసి గునుపూరి దేవి, శ్రీను రూ.15వేలు, బాడంగి మండలం వీరసాగరం గ్రామానికి చెందిన జి.శ్రీకాంత్ రూ.10,500, ముత్తావలస గ్రామానికి చెందిన పి.చంద్రమౌళి 10వేలు, సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేశారు. నగదు, చెక్కులను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు.

వరద భాదితులకు ఎమ్మెల్యే నెల జీతం

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తన సెప్టెంబర్ నెల జీతాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేసినట్లు బుధవారం తన నివాసంలో ఆమె వెల్లడించారు. వరద బాధితులు త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ప్రజలంతా వారికి అండగా నిలవాలని ఆమె కోరారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేటకు చెందిన బమ్మిడి రామకృష్ణ (30) మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ సన్యాసినాయుడు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రామకృష్ణ తన భార్యతో తరచుగా గొడవపడి చీటికిమాటికి అలిగేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం భార్యాభర్తల మధ్య మాటమాట పెరిగి గొడవైంది. దీంతో భార్యకు చెప్పకుండా ఇంటివద్ద నుంచి బయటికి వెళ్లిపోయి గడ్డి మందును కొనుక్కొని వాళ్ల సాల వద్ద తాగేశాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతునికి సంవత్సరం క్రితమే పెళ్లయింది. మృతుని అన్నయ్య రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు ధ్వంసం

బాడంగి: అక్రమ రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారుగా 700 మద్యం సీసాలను పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. విజయనగరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డివిజి రాజు, తెర్లాం ఎస్ఐ సాగర్ బాబు, విఆర్ఒ, పంచాయతీ సెక్రటరీ సమక్షంలో ఈ మద్యాన్ని ధ్వంసం చేశారు. గత అక్టోబర్ నుంచి ఏప్రిల్ 2024 వరకు 62 కేసుల్లో దొరికిన మద్యాన్ని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్లాబ్ కూలి ఒకరికి గాయాలు

డెంకాడ: ఇటీవల కురిసన వర్షాలకు మండల కేంద్రంలో ఒక ఇంటి స్లాబ్ నానిపోయి బుధవారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన రేఖ సూరిబాబు ఇంట్లో కుటుంబ సభ్యులతో మంగళవారం రాత్రి పడుకున్నాడు. తెల్లవారు జామున నాలుగు గంటలకు బయటకు వస్తున్న సమయంలో స్లాబ్ డూమ్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో సూరిబాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామ సచివాలయ విఆర్ఒ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ కూలిపోయిన ఇల్లును పరిశీలించి నివేదికను తహశీల్దార్‌కు పంపిచారు. కూలిన ఇళ్లను గాయపడిన సూరిబాబును పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఆర్ సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయాన్ని అందజేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

భోగాపురం: ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి భోగాపురం గ్రామానికి చెందిన బమ్మిడి కనకరాజు (39) బుధవారం మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. కనకరాజు ఉదయం బహిర్భూమి కోసం సినిమా హాలుకు ఎదురుగా ఉన్న చెరువుకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడిపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక యువకుడు చూసి చెప్పడంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈయన పైడి భీమవరంలోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్యతో పాటు ఇటీవల పుట్టిన ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మెంటాడ: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని చదువుకుంటున్న సమయంలో పిల్లలకు వివాహం చేయకూడదని ఐసిడిఎస్ పిఒ నాగమణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ త్రివిక్రమరావు మాట్లాడుతూ ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు ఉండాలని అప్పుడే వివాహ చట్టం చెల్లుబాటు అవుతుందని, లేనిపక్షంలో అందుకు ఉపక్రమించిన సహకరించిన వారందరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం తస్మాత్ జాగ్రత్త అనే గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ హైమావతి, సెక్టార్ కార్యకర్తలు రవణమ్మ సన్యాసమ్మతో పాటు పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన

రేగిడి: ఇంటెన్సిఫైడ్ ఐఐసి ప్రోగ్రాంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఉంగరాడ మెట్ట గ్రామంలో బుధవారం హెచ్ఐవి ఎయిడ్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవికి సంబంధించి నేషనల్ టోల్ ఫ్రీ నెంబర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవి ఎయిడ్స్ ఎలా వస్తుంది? ఎలా రాదు అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఒఆర్ డబ్ల్యు బి. అనురాధ, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న రొంగలి కనకసింహాచలం

ఘనంగా 'రొంగలి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు రొంగలి కనక సింహాచలం 72వ పుట్టినరోజు వేడుకలు బుధవారం కుటుంబ సభ్యులు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు నియోజవర్గంలో ఉన్న వైసిపి నాయకులు, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో గ్రామ సర్పంచ్ పతివాడ గౌరీ, నాయకులు ఆర్ గోపాలకృష్ణ, రమణ, మహేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM SPECIAL MOBILE MAGISTRATE AT VIZIANAGARAM
OS.No.598/2023

Between-
Sri Korada Suryanarayana and 4 others. ......Plaintiffs.
And:-
Sri. Korada Appalanaidu and 7 others. ......Defendants.

NOTICE TO THE 4th TO 7th JDRS/ DEFENDANTS

4. S. Apparao, S/o not known to the plaintiff R/o S.79/1, Railway New Colony, Near RB Guest House, Vizianagaram-535003.
5. S.Surya Chandra Rao, S/o not known to the plaintiff, R/o S.79/1, Railway New Colony, Near RB Guest House, Vizianagaram-535003.
6. S.Suramma, D/o not known to the plaintiff, R/o S.79/1, Railway New Colony, Near RB Guest House, Vizianagaram-535003.
7. Ramanamma, not known to the plaintiff, R/oS79/1, Railway New Colony, Near RB Cuest House, Vizianagaram-535003

Please take notice that the above matter stands posted to **20.09.2024** for the appearance of the 4th to 7th defendants before this Honourable Court by 10.30 you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 20.09.2024** in person or through an advocate, the above matter will be decided in your absence and ex-parte.

PEELA NAGA TULASI
Advocate for the plaintiff.
D. No. 38-38-38/9, Sivanagar, Marripalem, Visakhapatnam -18.
Cell: 9032692453, 7794976526

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
I.P. 15/2024

Between:
Govindu Venkata Parthasarathy, G.V.N.B. Ranga Rao, Flat.no.B1-203, Dolphin Heights, Singapore City, Vizianagaram, PIN-535002 ....Petitioner
And:
1. Bathunireddy Kanaka Saradha
2. Parupati Rami Reddy .....Respondent

1. ReddybathuniKanaka Saradha, D/o. Kandhi Rami Reddy, Hindu, aged 48 years, R/o. H.no.3-15NM9/101, New Malahar Estate, L.B.Nagar, Rangareddy, Telangana, PIN-500068
2. Parupati Rami Reddy, S/o.Madhusudhan Reddy, H.no.20-35/12, New Ram Nagar, Chilka Nagar, Uppal, Hyderabad, R.R. Dist, Telangana State.

NOTICE

It is hereby informed that the above named Petitioner filed the above insolvency petition against the respondentspraying the Hon'ble Court to declare him as Insolvent. It is therefore informed to all the respondents that the above case is posted to **27-09-2024** and as such you are informed to attend before the Hon'ble Court on that day at **10.30 A.M.** otherwise you will set ex parte.

D.Vijay Kumar
K.Satish Babu
Advocates,Vizianagaram
Ph: 7989485035

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
OS.3/2020

వాది:- టంకాల చంద్రశేఖర్
ప్రతివాది:- ఓమ్మి అప్పారావు

To,
ప్రతివాది అడ్రసు:
ఓమ్మి అప్పారావు, S/o సూర్యనారాయణ బిజినెస్ వరలక్ష్మి నగర్,పోనుగుటవలస రోడ్డు, రాజాం నగర పంచాయతీ, సంతకవిటి మండలం విజయనగరం జిల్లా.

ప్రకటన

పై నెంబర్ దావాను ప్రతివాది పైన వాది ప్రోనోట్ బాకిని రాబట్టే నిమిత్తం దాఖలు చేయడమైనది. సదరు దావాలో ప్రతివాది శ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో తేదీ **20-09-2024** ది **ఉదయం 10:30 నిమిషాలకు** అతని గల ఆక్షేపణలు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని తెలియజేయగలరు. అటులుకాని యెడల మీకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

పెయ్యల రామ్మోహనరావు
న్యాయవాది,
పొందూరు, సెల్: 9010797690